# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక


teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

శనివారం 19-8-2023

## పడ్డ చోటు నుంచే..
## పైకి ఎగిసేందుకు..

– రాబోయే ఎన్నికల్లోనూ అమేథి నుంచి రాహుల్ పోటీ

**న్యూఢిల్లీ, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

వెనక్కు మళ్లిన అలలు తిరిగి ముందుకురికినట్లు.. పడ్డచోటు నుంచే కెరటంలా పైకెదగాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ భావిస్తున్నారా ? అంటే అవుననే వినిపిస్తోంది. గత ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి పోటీచేసిన రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్‌నుంచి గెలుపొందినప్పటికీ, యూపీలోని అమేథీలో మాత్రం స్మృతిఇరాని చేతిలో ఓడిపోయారు. దాదాపు 55 ఓట్ల తేడాతో ఓడిన రాహుల్ గత పరాభవం స్థానే ఈసారి పరాక్రమం చూపాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాహుల్‌ను ఓడించిన స్మృతిఇరానికి మంత్రి పదవి లభించింది. భారత్ జోడో యాత్ర నుంచి రాజకీయంగా రాహుల్ స్పీడ్ పెరగడం తెలిసిందే. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో అవిశ్వాస తీర్మానంపై తనదైన శైలిలో విమర్శలు గుప్పించిన రాహుల్‌గాంధీ..రెండోసారి జోడో యాత్రతో ప్రజలను ఆకట్టుకోవాలనే యోచనలో ఉన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..
## ముగ్గురు మృతి

**విజయవాడ, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపింది. వేగంగా ఎదురుగావస్తున్న లారీని బైక్ ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. అర్థరాత్రి సమయంలో బైక్ పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు.




తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతులు కొనకనమిట్ల మండలం అంబాపురం గ్రామానికి చెందిన వినోద్, నాని, వీరేంద్రగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.




# సీటెవరికి
# చేటెవరికి

## బీఆర్ఎస్‌లో 20 మందికి పైగా సిట్టింగ్‌లకు నో టిక్కెట్ ?
## వారి స్థానాల్లో కొత్త వారి కోసం సర్వే

రాష్ట్రంలో బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో కొందరి సీట్లపై వేటు పడనుండగా.. కొందరు కొత్తవారికి అవి దక్కనున్నాయి. సిట్టింగ్‌లపై వేటు తమకు కలిసి వస్తుందని ఆశావహులు భావిస్తున్నారు. సిట్టింగ్‌లకే టిక్కెట్లన్నీ అని పార్టీ అధినాయకుడు కేసీఆర్ గతంలో ప్రకటించినప్పటికీ, కొందరి ఎమ్మెల్యేల ప్రవర్తన, నియోజకవర్గంలో వారిపై పెరుగుతున్న వ్యతిరేకత, ప్రజలతో వారు వ్యవహరిస్తున్న తీరుతోపాటు ఇతరత్రా అంశాలను బేరీజు వేసుకొని కొందరు సిట్టింగ్‌లకు కట్టింగ్ పెట్టక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఇదే కొత్తగా టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో కొత్త ఆశలు చిగురింపచేస్తోంది. ఎలాగూ వారికి టిక్కెట్లు ఇవ్వరు కనుక ఇక తమ పంట పండినట్లేనని భావిస్తున్నారు.

**హైదరాబాద్, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

బీఆర్ఎస్‌లో దాదాపు ఇరవై మందికి పైగా సిట్టింగ్‌లకు టిక్కెట్లు దక్కకపోవచ్చునని ప్రచారం జరుగుతోంది. టిక్కెట్లపై కన్నేసిన కొత్తవారు అంతకంటే ఎక్కువే ఉన్నారు. అయితే కొత్తగా టిక్కెట్ల నాశిస్తున్న వారి నియోజకవర్గాల్లో ఎంత మంది సిట్టింగ్‌లకు టిక్కెట్లు రావో కచ్చితంగా చెప్పే పరిస్థితి లేప్పటికీ గణనీయంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

**వేటుపడేవి ఇవేనా?**

సిట్టింగ్‌లపై వేటు పడనున్నట్లు అంచనాలున్న నియోజకవర్గాల్లో గ్రేటర్ నగరంలోని ఉప్పల్ ఎమ్మెల్యే బేతిసుభాష్‌రెడ్డి స్థానే టిక్కెట్ కోసం మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, బండారి లక్ష్మారెడ్డి, తదితరులు ప్రయత్నిస్తుండగా వీరిలో లక్ష్మారెడ్డికి టిక్కెట్ కన్‌ఫమ్ అయినట్లు చెబుతున్నారు. అలాగే రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశం, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ తదితరులకు ఈసారి టిక్కెట్లు రావని వినిపిస్తోంది. వీటిల్లో రామగుండం నుంచి కందుల సంధ్యారాణి, జహీరాబాద్‌నుంచి ఢిల్లీ వసంత్, నాగార్జునసాగర్ నుంచి మన్నెం రంజిత్‌యాదవ్, ముషీరాబాద్ నుంచి ఎమ్మెన్ శ్రీనివాసరావు టిక్కెట్ల నాశిస్తున్నవారిలో ఉన్నారు.

**వారి స్థానాల కోసం..**

కొత్తగా టిక్కెట్ల నాశిస్తూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న వారిలో రేణికుంట్ల ప్రవీణ్ (బెల్లంపల్లి), మిట్టపల్లి సురేందర్ (మానకొండూరు),చల్లా నారాయణరెడ్డి (మంథని), బౌద్ధుల లక్ష్మీ నర్సయ్య అలియాస్ లక్ష్మ ణ్ (పెద్దపల్లి), నీలం మధుముదిరాజ్(పటాన్‌చెరు)తదితరులున్నారు.వీరిలో కొందరు ఇప్పటికే ప్రచారాలు కూడా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిగణనలోకి తీసుకునే సామాజిక సమీకరణలు తమకు మేలు చేయగలవని భావిస్తున్నవారు ఇందులో ఉన్నారు. వీరిలో ఒకరిద్దరికి ఇప్పటికే పార్టీ ముఖ్యుల నుంచి సంకేతాలందినట్లు కూడా చెబుతున్నారు.

**వీరికి డౌటేనా?**

కోదాడ, మునుగోడు, వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, బెల్లంపల్లి, ఖానాపూర్, వైరా, కొత్తగూడెం, ఇల్లందు, నర్సాపూర్ , మరికొన్ని నియోజకవర్గాల్లోనూ సిట్టింగ్‌లకు కచ్చితంగా టిక్కెట్ లభిస్తుందో, లేదో చెప్పడం కష్టమేననే ప్రచారం జరుగుతోంది.

**బుజ్జగింపులు**

టిక్కెట్లు రాని వారికి ఉపశమనం కలిగించేందుకు అనివార్యకారణాల వల్ల ఈసారి టిక్కెట్ ఇవ్వలేమని చెబుతూ, బదులుగా ఎమ్మెల్సీ, కార్పొరేషన్ల చైర్మన్ల పదవులు వంటివి ఇస్తామని బీఆర్ఎస్ ముఖ్యనేతలు నచ్చజెప్తున్నట్లు తెలుస్తోంది. అలాంటివారిలో తాటికొండ రాజయ్య, చెన్నమనేని రమేశ్, తదితరులున్నట్లు తెలుస్తోంది.

## ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి
## తప్పిన ప్రమాదం

**విజయవాడ, ఆగస్ట్19(తెలుగుప్రభ):**



గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి తృటిలో ప్రమాదం తప్పింది. వల్లభనేని వంశీ కాన్వాయ్‌లోని వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. అయితే.. ఎమ్మెల్యే వంశీ సహా కాన్వాయ్‌లోని వారంతా సురక్షితంగా బయటపడ్డారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం ఖాసీంపేట దగ్గర ఈ ప్రమాదం జరిగింది. మిగిలిన వాహనాలతో హైదరాబాద్‌కు బయల్దేరారు ఎమ్మెల్యే వంశీ. ప్రమాదం జరగకపోవడంతో అభిమానులు ఊపిరిపీల్చుకున్నారు.




## మరో లేడీస్ స్పెషల్

– అందుబాటులోకి తెస్తున్న ఆర్టీసీ


**హైదరాబాద్, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

ఇప్పటికే ఐటీ కారిడార్లో మహిళల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ మరో రూట్‌లో వారి కోసం స్పెషల్ బస్సులు నడపనుంది. కోఠి– కొండాపూర్ వెళ్లే 127కే నెంబర్‌బస్సును మహిళల కోసం ప్రత్యేకంగా నడపనుంది. ఈనెల 21వ తేదీ(సోమవారం) నుంచి ఈ బస్సు సర్వీసు ప్రారంభం కానుందని, మహిళలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆర్టీసీ ఎండి సజ్జనార్ ట్విట్టర్ ద్వారా వెల్లడించారు.ఈ బస్సుప్రతిరోజు ఉదయం 8.50గంటకు కోఠినుంచి బయలుదేరి లక్డీకాపూల్, మాసాబ్‌ట్యాంక్, ఎమ్మెల్యే కాలనీ, గుట్టలబేగంపేట, శిల్పారామం, కొత్తగూడ క్రాస్‌రోడ్స్ మీదుగా కొండాపూర్‌వెళ్తుంది. తిరిగి సాయంత్రం అదే మార్గంలో తిరుగుప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. ఈ మార్గాల్లో ప్రయాణించే మహిళలు ఆర్టీసీ కల్పిస్తున్న ఈ సదుపాయాన్ని వినియోగించుకొని క్షేమంగా, సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆర్టీసీ కోరుతోందని పేర్కొన్నారు.

## వర్షానికి తెగిపోయిన రోడ్డు..

**జగిత్యాల, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

మోడల్ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో వర్షానికి రోడ్డు తెగిపోయింది. మోడల్ స్కూల్ కు వెళ్లే దారిలో ఉన్న రోడ్డు తెగిపోవడంతో విద్యార్థులు స్కూల్‌కు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు చేసినా మళ్లీ కురిసే వానలకు రోడ్డు తెగిపోతుందంటున్నారు. అధికారులు, స్పందించి వంతెన నిర్మించాలని విద్యార్థులు, పేరెంట్స్ కోరుతున్నారు.





## తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైల్లో అగ్ని ప్రమాదం

**నాగ్‌పూర్, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

మరో రైలు ప్రమాదం కలకలం రేపింది. శనివారం తెల్లవారుజామున మహారాష్ట్రలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మహారాష్ట్రలోని నాగపూర్ సమీపంలో తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఎస్-2 బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రయాణికుల నుండి సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది ట్రైన్‌ను నాగ్‌పూర్ సమీపంలో నిలిపివేశారు. సహాయక బృందాలు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని బోగీలోని మంటలను అదుపు చేశారు.పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో తీవ్ర ఆందోళనకు గురైన ప్రయాణికులు.. ట్రైన్ ఆగిన వెంటనే భయంతో పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## అధికారం కోసం
## దుర్మార్గులు వస్తున్నారు..

మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, ఆగస్ట్19(తెలుగుప్రభ):**

సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గతంలో హైదరాబాద్ నగరంలో కర్ఫ్యూలు ఉండేవని... ప్రజలు కొట్లాడుతుంటే నాయకులు పబ్బం గడుపుకొనే వారన్నారు. 55 ఏళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయలేకపోయిన వాళ్లకి.. మళ్లీ అధికారం ఇస్తే హైదరాబాద్ వెనుకబడి పోతుందన్నారు కేటీఆర్. ప్రజల కోసం పనిచేసే కేసీఆర్ కు మూడోసారి పట్టం కట్టాలన్నారు. అధికారం వస్తున్న దుర్మార్గులను దూరం పెట్టాలన్నారు. స్టీల్ బ్రిడ్జ్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్.. సెంట్రల్ హైదరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. స్టీల్ బ్రిడ్జికి నాయిని నర్సింహా రెడ్డి పేరు పెట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారన్నారు. ట్యాంక్ బండ పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇందిరా పార్కును అంతర్జాతీయ ప్రమాణాలతో అద్భుతంగా తీర్చిదిద్దే బాధ్యత తమదని వెల్లడించారు. లోయర్ ట్యాంక్‌బండ్, అప్పర్ ట్యాంక్ బండ్‌ను కలిపి అద్భుతంగా మారుస్తామన్నారు. విశ్వనగరంగా హైదరాబాద్ ఎదగాలనే కలకు పునాది పడిందని చెప్పారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా మళ్లీ కూర్చోబెట్టాలన్నారు. రానున్న రోజుల్లో ప్రతిపక్షాలకు సినిమా చూపిస్తామని వెల్లడించారు